డిగ్రీలో బకెట్ సిస్టం ఔట్..?

- ఇప్పటి వరకు నాలుగు బకెట్లుగా కోర్సులు
- ఈ విధానంపై కాలేజీల నుంచి వ్యతిరేకత

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ) : డిగ్రీలో నచ్చిన కోర్సును ఎంపికచేసుకునే బకెట్ ఆఫ్ కోర్సెస్(బీవోసీ) సిస్టం రద్దు కానుందా..? మళ్లీ పాత విధానమే ఉండబోతుందా..? అంటే అవుననే సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ విధానాన్ని పలు కాలేజీలు వ్యతిరేకిస్తున్నాయి. డిగ్రీ కోర్సుల్లో 2021 నుంచి బీవోసీని అమలు చేస్తున్నారు. మొత్తం డిగ్రీ కోర్సులను ఏ, బీ, సీ, డీ బకెట్లుగా విభజించారు. ఈ విధానంతో గతంలో పదుల సంఖ్యలో ఉన్న డిగ్రీ కోర్సులు ఇప్పుడు 505 అయ్యాయి. సబ్జెక్టు కాంబినేషన్లు పూర్తిగా మారిపోయాయి. డిగ్రీ కోర్సుల్లో మార్పులు చేర్పులపై ఇటీవలే ఉన్నత విద్యామండలి ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించింది. సమావేశంలో బకెట్ సిస్టంతో వస్తున్న ఇబ్బందులను బోర్డ్ ఆఫ్ స్టడీస్(బీవోఎస్) సభ్యులు ఏకరువుపెట్టారు. ముఖ్యంగా ఫిజిక్స్, కెమిస్ట్రీ కోర్సుల్లో అడ్మిషన్లు తగ్గుతున్నట్టుగా పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్ కోర్సులకు డిమాండ్ అధికంగా ఉండగా, ఆర్ట్స్ కోర్సులకు అంతగా డిమాండ్ ఉండటంలేదు. సబ్జెక్టుల పునరావృతం సైతం బకెట్ సిస్టంపై వ్యతిరేకతకు కారణమవుతున్నది. అయితే బకెట్ సిస్టం రద్దుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ ఎస్కే మహమూద్ పేర్కొన్నారు.

బకెట్ సిస్టం అంటే..

బీఎస్సీ సైన్స్ కోర్సులోని విద్యార్థి బీఏలో ఉండే సైకాలజీ, ఫిలాసఫీ, ఎకనామిక్స్ వంటి ఒక సబ్జెక్టును ఎంపికచేసుకోవడం బకెట్ సిస్టం ప్రత్యేకత. ఈ విధానంలో డిగ్రీ కోర్సుల్లోని వారు తమకు ఆసక్తి ఉన్న, కోర్సుతో సంబంధంలేని మరో సబ్జెక్టును ఎంపిక చేసుకోవచ్చు. అంటే ఆర్ట్స్ విద్యార్థి సైన్స్ కోర్సులను.. సైన్స్ విద్యార్థులు ఆర్ట్స్ కోర్సులను తీసుకోవచ్చు. డిగ్రీలో నాలుగు బకెట్స్ ఉండగా.. ఒక్కో బకెట్‌లో కొన్ని సబ్జెక్టులుంటాయి. విద్యార్థి రెండు కోర్సులకు సంబంధించిన మేజర్ సబ్జెక్టులను, ఇతర బకెట్‌లోని మరో సబ్జెక్టును ఎంపికచేసుకోవచ్చు.

బీఎస్సీలో పలు కొత్త కోర్సులు..

ఇక బీఎస్సీలో పలు కొత్త కోర్సులను ప్రవేశపెట్టాలని నిపుణులు కోరారు. వర్తమాన పరిశ్రమ అవసరాలకు తగినట్టుగా 6 కొత్త కోర్సులను ప్రవేశపెట్టాలని సూచించారు. నిరుడు బీఎస్సీ బయో మెడికల్‌సైన్స్ కోర్సును ప్రవేశపెట్టగా, ఈసారి సైన్స్‌లో కొత్త కోర్సులను తీసుకురావాలని అధికారులను కోరారు.

ఆర్ట్స్‌లో ఏఐ పాఠాలు

డాటాసైన్స్, సైబర్ సెక్యూరిటీలు కూడా

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ) : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఇంజినీరింగ్.. సైన్స్‌కోర్సులకు మాత్రమే పరిమితం. కానిప్పుడు ఇదే ఏఐ బీఏ ఆర్ట్స్ కోర్సుల్లోనూ ఉంటుంది. బీఏ ఎకనామిక్స్, బీఏ పొలిటికల్ సైన్స్ కోర్సుల్లోనూ అంతర్భాగమవుతుంది. అయితే ఏఐ కోర్సుగా కాకుండా ఒక పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టాలని ఉన్నత విద్యామండలి అధికారులు నిర్ణయించారు. డాటాసైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి అంశాలపైనా పాఠ్యాంశాలను ప్రవేశపెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ఆర్ట్స్ కోర్సుల్లోనూ సెమినార్లు, ప్రాజెక్టులు/ ఇంటర్న్‌షిప్‌లు ప్రవేశపెట్టాలని సోమవారం నిర్వహించిన ఆర్ట్స్ సిలబస్ రివిజన్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. మాసాబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ పాల్గొన్నారు.

డిగ్రీలో రీజనింగ్, అర్థమెటిక్

సివిల్స్.. స్టాఫ్ సెలెక్షన్ కమిషన్.. ఆర్ఆర్‌బీ, ఐబీపీఎస్ ఇలా ఏదీ తీసుకున్నా రీజనింగ్, అర్థమెటిక్ చదవాల్సిందే. కానీ ఇవేవీ మనం చదువుకునే పాఠశాల విద్య, ఇంటర్, డిగ్రీలో ఉండవు. ఎక్కడా ఎదురవవు. కానీ కొలువు సాధించాలంటే ఈ సబ్జెక్టులే కీలకం. వీటిల్లో కనీస పరిజ్ఞానం లేక మన విద్యార్థులు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో డిగ్రీలో రీజనింగ్, అర్థమెటిక్ డిగ్రీ కోర్సుల్లో రీజనింగ్, అర్థమెటిక్, జనరల్ ఇంగ్లిష్ వంటి సబ్జెక్టులను ప్రవేశపెట్టాలని ఉన్నత విద్యామండలి భావిస్తున్నది. ఇక నుంచి ఈ సబ్జెక్టులను చదవడం తప్పనిసరి చేయనుంది. జనరల్ ఇంగ్లిష్‌ను అన్ని కోర్సుల్లో ప్రవేశపెట్టనుండగా, రీజనింగ్, అర్థమెటిక్ గణితం, స్టాటిస్టిక్స్ వంటి సబ్జెక్టులను అంతర్భాగం చేయనున్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్ కోర్సుల్లోనూ వీటిను బట్టి ఉద్యోగ నియామకపరీక్షల్లో ఎదురయ్యే సిలబస్‌ను అంతర్భాగం చేయాలని భావిస్తున్నారు. మార్చి నెలాఖరుకు సిలబస్‌ను తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆర్ట్స్ కాలేజీలో నాలుగేండ్ల డిగ్రీ కోర్సు

- 100 ఏండ్ల చరిత్రలో ఇదే మొదటిసారి
- ఓయూలో బీఏ తెలుగుతో శ్రీకారం

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ) : ఉస్మానియా యూనివర్సిటీ చరిత్రలో తొలిసారిగా నాలుగేండ్ల డిగ్రీ కోర్సులను ప్రవేశపెట్టనున్నది. ఇప్పటి వరకు క్యాంపస్‌లో పీజీ కోర్సులను మాత్రమే నిర్వహిస్తున్నారు. 1970కి ముందు తొలగించిన డిగ్రీ కోర్సులను ఆ తర్వాత పునరుద్ధరించడం ఇదే తొలిసారి. కొన్ని కాలేజీల్లో ఇంటిగ్రేటెడ్ డిగ్రీ కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చాయి. కానిప్పుడు కొత్తగా నాలుగేండ్ల డిగ్రీ కోర్సును ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. తొలుత బీఏ తెలుగు కోర్సును ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ప్రవేశపెడతారు. సోమవారం మాసాబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఆర్ట్స్ కోర్సుల సిలబస్ రివిజన్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆ తర్వాత దశలవారీగా డిగ్రీ కోర్సులను అందుబాటులోకి తీసుకొస్తారు. ఇది నాలుగేండ్ల ఆనర్స్ డిగ్రీకోర్సుకాగా ఈ కోర్సు పూర్తిచేసిన వారు ఏడాదిలోపు పీజీ కోర్సును పూర్తిచేసుకోవచ్చు.

డిగ్రీలోనే సివిల్స్ సిలబస్..

డిగ్రీ కోర్సుల సిలబస్‌లో మార్పులు చేయడంతో సివిల్స్‌ను సులభతరం చేయగలమన్న దిశలో అధికారులు బీఏ తెలుగు కోర్సుకు రూపకల్పనచేశారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఈ కోర్సును ఆర్ట్స్ కాలేజీలో ప్రవేశపెట్టాలని నిర్ణయించారు.

సీడీపీవో జీఆర్ఎల్ విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ) : మహిళాశిశు సంక్షేమశాఖలో చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్(సీడీపీవో) ఫలితాలు విడుదలయ్యాయి. పోస్టులకు సంబంధించిన జనరల్ ర్యాంకింగ్ లిస్టు (జీఆర్ఎల్)ను టీజీపీఎస్సీ సోమవారం విడుదల చేసింది. జనవరి 3, 4న పరీక్షలు నిర్వహించగా, అభ్యర్థుల రెస్పాన్షిషీట్లు, ఫైనల్ 'కీ', జీఆర్ఎల్‌ను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు.

నేడు హెచ్‌డబ్ల్యూవో వెరిఫికేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ) : హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టుల భర్తీలో భాగంగా మంగళవారం నాలుగో విడత సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్టు టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30గంటల నుంచి నాంపల్లిలోని టీజీపీఎస్సీ కార్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తామని, హాజరుకాని వారికి..19న సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని చెప్పారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు


GEETHA ARTS
DSP
2వ వారం
ALLU ARAVIND PRESENTS
పుష్ప
CHANDOO MONDETI BUNNY VAS DEVI SRI PRASAD
BLOCKBUSTER
సంధ్య 70 ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
కోణార్క్ ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్
ప్రశా